

నేడు నగర పాలక కార్యాలయంలో 'స్పందన'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరవాసుల సమస్యల పరిష్కారం కోసం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జె.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక ఆవరణలో సోమవారం (5.6.2023) ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమానికి హాజరయ్యే వారు మాస్కులు ధరించి, కోవిడ్-19 నిబంధనలను పాటించాలని కోరారు. స్పందన కార్యక్రమానికి నగరపాలక శాఖాధిపతులు హాజరు కావాలన్నారు. అన్ని వార్డు సచివాలయల్లోనూ సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య స్పందన కార్యక్రమం జరుగుతుందని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటితో పాటుగా నగరపాలక సంస్థ కాల్‌సెంటర్ నెంబర్ 08572 232745, వాట్సప్ నంబర్ 98499 07885 ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు.

మన రైళ్లకు కవచ్ కావాల్సిందే..!

- రైల్వే భద్రతకు ఇది మంచి మార్గం
- రైల్వే స్టేషన్లో సిగ్నల్ వ్యవస్థ పటిష్టమేనా..?
- గతంలో పలు ప్రమాదాలు కవచ్ వ్యవస్థతో నివారించినట్లు చెబుతున్న నిపుణులు



ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

ఒడిస్సా రైలు ఘోరప్రమాదం యావత్తు భారతదేశం విషాదంలో ముంచేసింది. ఈ ఘటంతో పలు రైల్వేస్టేషన్లో సిగ్నల్ వ్యవస్థపై ఆందోళన వ్యక్తం అవుతుంది. అయితే కవచ్ పేరుతో రైల్వేశాఖ తీసుకువచ్చిన యాంటీ కోలిజన్ వ్యవస్థ ద్వారా ప్రమాదాలు నివారించవచ్చు అని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. డేంజర్ సిగ్నల్‌ను పట్టించుకోకుండా లోకో పైలట్ రైలు ముందుకు తీసుకెళ్లినప్పుడు ఈ కవచ్ వ్యవస్థలో ఆటోమేటిక్‌గా బ్రేకులు పడతాయి. రైలు పట్టాలు బాగా లేనప్పుడు, సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు, ఎదురెదురుగా రైళ్లు వస్తున్నప్పుడు కూడా కవచ్, గుర్తించి రైళ్ల ఢీకొనడం ఆపుతుంది. అత్యంత కీలకమైన ఈ వ్యవస్థను అన్ని మార్గంలో అమలు చేయడం వల్ల ప్రమాదాలు నివారించే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి మీదుగా అనేక సూపర్ ఫాస్ట్ ఎక్ప్రెస్ రైలు, ఫాస్ట్ రైళ్లు నడుస్తున్నాయి. తిరుపతి మీ దగ్గర రోజుకు 80 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ముఖ్యంగా చిత్తూరు తిరుపతి మీదుగా కాచిగూడ వెళ్ళు వెంకటాద్రి, తిరుపతి మీదుగా గుంతకల్లు హైదరాబాద్ వెళ్ళు రాయలసీమ ఎక్స్‌ప్రెస్, తిరుపతి ముంబై, తిరుపతి ఢిల్లీ, తిరుపతి బెంగళూరు, తిరుపతి హౌరా, తిరుపతి కలకత్తా మీదుగా పలు రైళ్లు రోజు ఈ మార్గంలో వెళ్తాయి.

దేశంలోని ప్రధాన నగరాలతో పాటు వివిధ ప్రాంతాలకు ఈ రైలు మార్గాల గుండా రోజువారి, వారపు రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. రోజుకు వందల రైలు రాకపోకలు సాగిస్తున్నాయి. రేణిగుంట జంక్షన్‌లో అనేక రైళ్లు వెళుతున్నాయి. ప్రతి స్టేషన్లో ఆఫ్‌లైన్, డౌన్‌లైన్ వీటికి అనుబంధంగా రెండు లూప్ లైన్లు కలిపి నాలుగు రైల్వే లైన్లు ఉంటాయి. ఏ లైన్‌లో ఏ రైలు పంపించాలో సిగ్నల్ వ్యవస్థ ఎంతో కీలకం. ఈ సిగ్నల్ వ్యవస్థ నిర్వహణలో రైల్వేశాఖ అత్యంత ముఖ్యమని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ఈ సిగ్నల్ వ్యవస్థలో ఏ చిన్నపాటి నిర్లక్ష్యం జరిగిన ప్రమాదాలు తప్పవు. ఒడిస్సా ఘోర రైలు ప్రమాదం నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో సిగ్నల్ వ్యవస్థ నిర్వహణ తీరుపై దష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా తిరుపతి నుంచి సికింద్రాబాద్ నూతనంగా వేసిన వందే భారత్ సూపర్ ఫాస్ట్ ట్రైన్ గంటకు 100 కిలోమీటర్ల స్పీడు వెళ్తుందని ప్రయాణికులు అంటున్నారు. అయితే ఈ రైలుకు కవచ్ వ్యవస్థ ఉందా లేదా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

ప్రమాదాల నివారణకు కవచ్.....

రైలు ప్రమాదాలు నివారణకు కవచ పేరుతో యాంటీ కొలిజేన్ వ్యవస్థను రైల్వేశాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇది ప్రమాదాలు నివారణకు కవచంలా పనిచేస్తుందని రైల్వే భద్రతా నిపుణులు అంటున్నారు. డేంజర్ సిగ్నల్‌ను పట్టించుకోకుండా లోకో పైలట్ అలాగే రైలును తీసుకెళుతుంటే ఇక ఆటోమేటిక్‌గా బ్రేకులు పడతాయి. రైలు పట్టాలు బాగా లేనప్పుడు, సాంకేతిక సమస్యలు వచ్చినప్పుడు, ఎదురెదురుగా రైళ్లు వస్తున్నప్పుడు, గుర్తించి కవచ్ ఆపుతుంది. దీంతో రైలు ఢీకొనే ప్రమాదాలను వివరించవచ్చు. అయితే అత్యంత కీలకమైన కావచ్ దేశంలో కొన్ని మార్గాల్లో మాత్రమే అందుబాటులో తెచ్చారు. గుంతకల్ డివిజన్ పరిధిలో ఎంతో కీలకమైన చెన్నై ముంబై వయా రేణిగుంట తిరుపతి వంటి ప్రాంతాల్లో కవచ్ వ్యవస్థ ఈమార్గాల్లో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఒరిస్సా రైలు ప్రమాదం దుర్ఘటనను చూసిన ఇవి మార్గాల్లో కూడా కవచ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైల్వేశాఖ లైన్ల, విద్యుద్దీకరణ, రైళ్ల సామర్థ్యం పెంచుతుంది. ఇది అభినందించాల్సిన అంశమే. ఇదే క్రమంలో బ్రే సింగ్ సామర్థ్యం, సిబ్బంది సామర్థ్యం కూడా పెంచాల్సిన అవసరం ఉంది. దేశవ్యాప్తంగా 3.12 లక్షల రైల్వేలో ఖాళీలు భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

సిగ్నల్ వ్యవస్థ నిర్వహణ ఇలా....

సిగ్నల్ వేస్తా జోనల్ పరిధిలోని ప్రిన్సిపాల్ చీఫ్ ఆపరేటర్ మేనేజర్ పర్యవేక్షణలో పనిచేస్తుంది. డివిజన్ స్థాయిలో సీనియర్ డివిజనల్ ఆపరేషన్ మేనేజర్, ఆయన దిగువన డివిజనల్ ఆపరేషన్ మేనేజర్, (డిఎంఓ కోచింగ్), డివిజనల్ ఆపరేషన్ మేనేజర్ (డిఎంఓ గూడ్స్), వారి దిగువ ఏవోఎం కోచ్, ఏవోఎం గూడ్స్ ఉంటారు. ప్రతి రైల్వేస్టేషన్లో డిప్యూటీ స్టేషన్స్ సూపరింటెండెంట్ సిగ్నల్ వ్యవస్థను నిర్వహిస్తారు. స్టేషన్లో సిగ్నల్ వ్యవస్థ నిర్వహించే డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్లు డివిజన్‌స్థాయి సీనియర్ డివిజనల్ ఆపరేషన్ మేనేజర్లు పరవేక్షణలో పనిచేస్తారు. తిరుపతి, చిత్తూరు, రేణిగుంట, రైల్వేస్టేషన్ మినహా సిగ్నల్ వ్యవస్థ గుంతకల్ డివిజన్ పరిధిలో ఉంటుంది. ఈక్రమంలో ఎక్కడ నిర్లక్ష్యం జరిగినా రైలు ప్రమాదాలను గురి అయ్యే అవకాశం ఉంది.

గతంలో అనేక ప్రమాదాలు...

గతంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ కడప మార్గంలో పట్టాలు తప్పడం జరిగింది. నలుగు సంవత్సరాల తిరుపతి నుంచి విశాఖపట్నం వెళ్లే తిరుమల ఎక్స్ప్రెస్ కూడా శ్రీకాళహస్తి వద్ద ప్రమాదాలకు గురైన విషయం తెలిసిందే. అప్పుడప్పుడు అనేక రైలు పట్టాలు తప్పడం జరిగింది.


కవచ్ వ్యవస్థ ఉంటే ఎదురెదురుగా వస్తున్న రైళ్లు బ్రేక్ పడి ఆగిపోతాయి

శ్రీవారి భక్తులకు అండగా టీటీడీ

- ఘాట్ రోడ్డు ప్రమాదాలపై సమగ్ర దర్యాప్తు
- డయల్ యువర్ ఈఓలో ధర్మారెడ్డి



ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల భద్రత కోసం ఘాట్ రోడ్ల ప్రయాణంలో ప్రమాదాల నివారణకు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేశామని టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి చెప్పారు. టీటీడీ చరిత్రలో తొలిసారిగా అధికారులు, ఉద్యోగులందరూ సుందర తిరుమల-శుద్ధ తిరుమల పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారని చెప్పారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో ఆదివారం డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వేసవి సెలవుల్లో తిరుమల శ్రీవారి దర్శనార్థం విశేషంగా విచ్చేస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీలోని అన్ని విభాగాలు సమన్వయంతో సేవలందిస్తున్నాయి. 'ఇందుకోసం జూలై 15వ తేదీ వరకు శుక్ర, శని, ఆదివారాల్లో విఐపి బ్రేక్ దర్శనాలను ప్రొటోకాల్ ప్రముఖులకు మాత్రమే పరిమితం చేశాం. సుప్రభాత సేవ విచక్షణ కోటా రద్దు చేశాం. తద్వారా ఎక్కువ మంది సామాన్య భక్తులు శ్రీవారిని దర్శించుకోగలుగుతున్నారు. టీటీడీ సిబ్బందితోపాటు శ్రీవారి సేవకులు, ఇతర విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేసి భక్తులకు చక్కటి సేవలు అందిస్తున్నారు. తిరుమలలో ఎక్కువ రద్దీ ఉన్న సమయంలో టోకెన్ లేకుండా దర్శనానికి వచ్చిన భక్తులు శ్రీవారి దర్శనం కోసం దాదాపు 2రోజుల పాటు వేచి ఉండాల్సి వస్తుంది. అటువంటి సమయంలో భక్తులు ఓపికతో ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అని ఈవో తెలిపారు.

'తిరుమల భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు రాష్ట్ర హోంశాఖ ప్రధాన కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా ఆధ్వర్యంలో పోలీసు ఉన్నతాధికారులు తిరుమలలో రెండు రోజులపాటు భద్రతాపరమైన అంశాలపై సమీక్ష నిర్వహించారు. తద్వారా భక్తుల భద్రతకు పెద్దపీట వేస్తున్నాము. నెల రోజుల్లో 15,441 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 13,351 మంది కార్పొరేషన్ సిబ్బంది, 6 వేల మందికి పైగా శ్రీవారి సేవకులు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, కలెక్టరేట్, పోలీస్, న్యాయశాఖ అధికారులు తిరుమలలోని పలు ప్రాంతాలు, రెండు ఘాట్ రోడ్లు, రెండు నడక దార్లలో పారిశుధ్య విధుల్లో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. మే 13వ తేదీన సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి.రమణ సైతం తిరుమల క్షేత్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే బహత్తరమైన కార్యక్రమంలో పాల్గొని ఎంతో మందికి స్ఫూర్తినిచ్చారు' అని తెలిపారు.

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం

'తిరుమల ఘాట్‌రోడ్లలో ఇటీవల డ్రైవర్ల నిర్లక్ష్యం, వాహనాల కండీషన్ బాగా లేనందు వల్ల కొన్ని ప్రమాదాలు జరిగాయి. ప్రమాదాల నివారణకు జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధం చేశాము. ట్యాక్సీ డ్రైవర్లు, వాహనదార్లు డ్రైవింగ్ చేసే సమయంలో టీటీడీ నిర్ణయించిన వేగం మేరకే నిదానంగా ప్రయాణించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడకుండా, మలుపుల వద్ద పరిమిత వేగంతో, ఓవర్ టేక్ చేయకుండా జాగ్రత్తలు పాటించాలి' అని కోరారు.

శ్రీ పద్మావతి హదయాలయంలో 20నెలల వ్యవధిలోనే 1450 మంది చిన్నారులకు ఉచితంగా గుండె అపరేషన్లు నిర్వహించారు. క్లిష్టమైన గుండె అపరేషన్లు కూడా ఆరోగ్య శ్రీ లేదా ఆయుష్మాన్ భారత్ స్కీంల కింద, ప్రాణదానం ట్రస్టు సహకారంతో నిర్వహిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన పిల్లలు కూడా ఈ సదుపాయాన్ని ఉపయోగించుకుంటున్నారు. మూడు గుండెమార్పిడి ఆపరేషన్లు కూడా విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. 'టీటీడీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని కొంత మంది వ్యక్తులు సామాజిక మాధ్యమాల ద్వారా నిరుద్యోగులను మోసం చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తుల మీద ఐటి విభాగం ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. నిరుద్యోగులు ఇలాంటి ప్రకటనలు నమ్మి మోస పోవద్దు' అని ఈవో ధర్మారెడ్డి భక్తులను కోరారు.

మే నెలలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 23.38 లక్షలుకాగా, హుండీ కానుకలు రూ.109.99 కోట్లు ఆదాయం లభించిందని తెలిపారు. విక్రయించిన శ్రీవారి లడ్డూల సంఖ్య ఒక కోటి 6 లక్షలు కాగా, అన్నప్రసాదం స్వీకరించిన భక్తుల సంఖ్య 56.30 లక్షలు. తలనీలాలు సమర్పించిన భక్తుల సంఖ్య 11 లక్షలు అని తెలిపారు.

వైద్యరంగం నిర్వీర్యం

టిడిపి ఎమ్మెల్యే డోలా

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో: వైసిపి పాలనలో వైద్య రంగం నిర్వీర్యమైందని, ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు లేవని టిడిపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి విమర్శించారు. రోగులకు సరిపడా మందులు లేవని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిఎం, ఆరోగ్య శాఖమంత్రి సమీక్షలకే పరిమితం మయ్యారని, సమస్యల పరిష్కారంపై దృష్టి సారించటం లేదని ఆరోపించారు. ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ కార్డులను ప్రైవేట్ ఆస్పత్రులు బేకతార్ చేస్తున్నాయని, ఆరోగ్యశ్రీ కార్డును చూపిస్తే కనీసం లోపలికి రానివ్వటం లేదని వివరించారు. రూ.1000 నుంచి రూ.10లక్షల వరకు ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా వైద్యం అందిస్తామని, పొరుగు రాష్ట్రాల్లో కూడా వర్తింపచేసే విధంగా చర్యలు తీసుకుంటామని సిఎం ఊదరగొట్టారని తెలిపారు. చిత్తూరు జిల్లాల్లో కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు అనుమతించడం లేదని పేర్కొన్నారు. బకాయిలు ఉన్నాయని, నెట్‌వర్క్ ఆస్పత్రులు అడ్మిషన్లు నిరాకరిస్తున్నాయని తెలిపారు. సీరియస్ కేసులను కూడా అడ్మిషన్ చేసుకోవడం లేదని వివరించారు. పాలన గాలికొదిలి ప్రతిపక్షాలపై కక్షసాధింపులకు దిగుతూ పేదల జీవితాలతో జగన్ చెలగాటమాడుతున్నారని విమర్శించారు. ఆరోగ్యశాఖపై సిఎం, మంత్రి దృష్టి సారించాలని, ఆరోగ్యశ్రీ నిరాకరిస్తున్న ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమస్య పరిష్కారానికి మూలం గణితం

విజయం విద్యా సంస్థల అధినేత తేజోమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న విజయం విద్యా సంస్థల అధినేత తేజోమూర్తి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి వినోదం కార్యక్రమం ముగింపు సమావేశం ఆదివారం స్థానిక విజయం డిగ్రీ కళాశాల్లో నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వేగగణితంపై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెవివి గౌరవ్యాధక్షులు మునిరత్నం మాట్లాడుతూ ప్రతి ఏడా వేసవిలో విద్యార్థులోని సృజనాత్మక శక్తిని పెంచేలా జెవివి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈఏడాది వేసవి వినోదం పేరుతో 15రోజులు పాటు నిర్వహించిన కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి మాట్లాడుతూ తార్కిక ఆలోచన సమస్య పరిష్కారినికి మూలం గణితమన్నారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులు టీవీలు, సెల్‌పోన్లకు పరిమితం కాకుండా విద్యార్థులను అధ్యయనం వైపు దృష్టి మళ్లించేందుకు జెవివి వేసవి వినోదం కార్యక్రమం నిర్వహించిన్నట్లు చెప్పారు. 15 రోజులు విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన గణిత అవధాని అరుణ శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు గణితంపై శిక్షణ ఇచ్చామని అలాగే వేసవి సెలవుల్లో వినోదం, విజ్ఞానం అందించామన్నారు. కార్యక్రమంలో పాపుదేశి పౌండేషన్ జయంతి, జెవివి నగర అధ్యక్షులు వేణుగోపాల్, నాయకులు విజయ కుమార్, ఉమాపతి, బాలయ్య, రచయిత్రి సంధ్యా పాల్గొన్నారు.

నేడు అటవీశాఖ గ్రీన్ ర్యాలీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని అటవీ శాఖ వారిచే గ్రీన్ ర్యాలీ ఉదయం 7 గంటలకు గాంధీ సర్కిల్ వద్ద ప్రారంభమై నగర వనం వరకు నిర్వహించనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో ఎఫ్ఆర్ఓ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు. ఈర్యాలీలో పాల్గొనుటకు ఆసక్తిగల వారు ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని 70136 46443, 73370 30956 రిజిస్ట్రేషన్ కోసం ఫోన్‌నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈర్యాలీలో జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్, ఎస్‌పి వై.రిషాంత్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో..


విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

- జూన్ 12 నుంచి పాఠశాల పునఃప్రారంభం
- నాడు- నేడుతో మౌలిక వసతులు

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జూన్ 12వ తేదీ నుంచి ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపుకు కృషి చేయడం జరుగుతుంది. ఇందుకు అనుగుణంగా వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు పూర్తి చేయడం జరిగింది. అలాగే ప్లస్ టూ జిల్లాలో ఏర్పాటు చేసిన ప్లస్ టూ పాఠశాలల్లో అర్హత కలిగిన పీజీ పూర్తి చేసిన ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ నిర్వహించి సబ్జెట్ల వారీగా ఉపాధ్యాయుల నియామకం పూర్తి చేశాం. రానున్న విద్యా సంవత్సరం ఒకటో తరగతిలో అడ్మిషన్లు ప్రారంభమైయ్యాయి. గత విద్యా సంవత్సరం కంటే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చేరి విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని అంచనా వేస్తున్నాం. ఈ మేరకు డీవైఈవోలు, మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా వారి పరిధిలో ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలన్ని బడిలో చేర్పించాలని ఆదేశించామని జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు తెలిపారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపుపై తెలియజేస్తూ...


విజయేంద్రరావు
జిల్లా విద్యాశాఖాధికారి

ప్రజాశక్తి: పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పిన నాడు- నేడు పనులు ఎలా జరుగుతున్నాయి?

డీఈవో: నాడు- నేడు మొదటిలో జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణం పూర్తి చేయడం జరిగింది. అలాగే రెండో దశలో ఎంపికైన పాఠశాలల్లో పనులు 90శాతం పూర్తి చేయడం జరిగింది. విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి రెండవదశ పనులు పూర్తి కావాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం.

ప్రజాశక్తి: జనన్న విద్యా కానుక కిట్లు జిల్లాకు వచ్చాయా...?

డీఈవో: జగన్న విద్యాకానుక పేరుతో విద్యాసంవత్సరం ప్రారంభం మునుపే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నోటుపుస్తకాలు, అచ్చుపుస్తకాలు, బ్యాగులు, షూలు అదించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈమేరకు జిల్లాకు మొదటి విడత జగన్న విద్యాకానుక కిట్లు వచ్చాయి. వీటిని డివైఈవో పాయింట్లలో ఉంచడం జరిగింది. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.


ప్రజాశక్తి: ఉపాధ్యాయుల కొరత ఉందా....?

డీఈవో: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేదు. ఇటీవల గతంలో అగిపోయిన డిఎస్‌సి అభ్యర్థులను విధుల్లోకి తీసుకొని జిల్లాలోని వివిధ పాఠశాలల్లో పోస్టింగ్ ఇవ్వడం జరిగింది. అలాగే ఎంఈఓల భర్తీ పూర్తిచేశాం. విద్యార్థుల సంఖ్యను బట్టి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొతర లేకుండా ఉపాధ్యాయులను నియమించడం జరిగింది.

ప్రజాశక్తి: ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందా...?

డీఈవో: విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠశాల పరిధిలో ఐదు సంవత్సరాలు నిండిన విద్యార్థులను గుర్తించాం. పిల్లల తల్లిదండ్రులకు నేడు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మౌళిక సదుపాలయాలపై అవగాహన కల్పించడం జరిగింది. గత ఏడాదిలో ప్రైవేటు పాఠశాలల నుండీ ప్రభుత్వ పాఠశాలల్లో అనేక మంది విద్యార్థులు చేరారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో చేరే అవకాశముంది.

పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు: జెసి



ప్రపంచ పర్యావరణ దినోత్సవ కరపత్రాలు విడుదల చేస్తున్న జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా జాయింట్ కలెక్టర్ వారి క్యాంపు కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణ అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ వాల్టా చట్టం కింద చెట్లను నరికితే వారి వద్ద నుండి రూ.50,000లు జరిమానా వసూలు చేయబడుతుందని అన్నారు. పచ్చదనం పరిరక్షణకు ప్రతిఒక్కరూ కషి చేద్దామని తెలిపారు. కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ చదలవాడ హరిబాబు మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన జీవితంలో నాలుగు చెట్లను పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. చెట్లను నరకడం వలననే అధిక ఉష్ణోగ్రతలతో మనమందరం బాధపడుతున్నామని అన్నారు. అనంతరం కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ వారు రూపొందించిన గోడపత్రికను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మక్కెన అచ్చయ్య, లక్ష్మీ చెన్నకేశవరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మనువాద బీజేపీని గద్దెదింపుదాం

సిపిఐ రాష్ట్ర నాయకులు రామానాయుడు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: భారత రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ, మనువాదం పేరుతో ప్రజల్ని దగా, మోసం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దెదింపాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు పిలుపునిచ్చారు. సిపిఐ చిత్తూరు జిల్లా కార్యవర్గ సమావేశం ఎస్సీయు కార్యాలయంలో సిపిఐ నగర కార్యదర్శి విసి గోపీనాథ్ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామానాయుడు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైఎస్ఆర్సిపి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రభుత్వాలను ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీ నాయకులపైన వాస్తవాలను ప్రతింభిస్తున్న మీడియా పైన అక్రమ పోలీసుకేసులు పెట్టి జైల్లో పెట్టి భయభ్రాంతులకు గురిచేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం ప్రభుత్వాలకు తగదన్నారు. ప్రభుత్వం విద్యను, వైద్యాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి సామాన్య ప్రజలకు వైద్యాన్ని విద్యను దూరం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు సిపిఐ కార్యకర్తలు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి టి.జనార్ధన్, జిల్లా కార్యవర్గ సభ్యులు విసి.గోపీనాథ్, దాసరి చంద్ర, కె.విజయ గౌరీ, ఎస్.జయలక్ష్మి, పి.మార్కొండయ్య, రమాదేవి పాల్గొన్నారు.




మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల

సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో సుమారు మూడు వేల మంది మున్సిపల్ కార్మికులు 4 మున్సిపాలిటీలు, 1 మున్సిపల్ కార్పొరేషన్‌లు, నగర పంచాయతీలలో పనిచేస్తున్నారు. వీరికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించడం లేదని వెంటనే చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అనేక తీర్పుల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు టైంస్కేల్ అమలు చేయాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా నేటికీ అమలు జరగలేదని అన్నారు. అలాగే శాశ్వత స్వభావం కలిగిన పనులలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో కార్మికులను నియమించకూడదని చట్టం చెబుతున్నప్పటికీ మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లు, నగర పంచాయతీలలో ఔట్‌సోర్సింగ్,కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలు జరుగుతున్నాయన్నారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని గత శాసన సభలో ప్రతి పక్షంలో వున్నప్పుడు ప్రకటించారని, అధికారంలోకి వచ్చిన వారం రోజులలోపే సిపిఎస్ ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి నాలుగేళు గడుస్తున్నా ఈ హామీని నేటికీ నెరవేర్చలేదని విమర్శించారు. కాంట్రాక్ట్ విధానాన్ని రద్దుచేసి శాశ్వత స్వభావంలో పనిచేసే కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలి. 010 పద్దు కింద మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే సుప్రీం కోర్టు తీర్పు (2016) ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్సులు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు జివోఎంఎస్ నెం.7 పకారం నెలకు రూ.18,500లు చెల్లించాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రమంతా యాత్రలు జరుగుతున్నాయని, సంబంధిత సంఘాలను పిలిచి చర్చించి సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సండే సందడి..



సండే సందడిలో చిన్నారులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వేసవి శిక్షణా తరగతుల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మ్యూజికల్ చైర్, కబడ్డీ, చెస్, క్యారమ్స్ పోటీలను కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా సరదాగా ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రంథాలయ కార్యదర్శి లావణ్య, లలిత, గజేంద్రబాబు సిబ్బంది పూర్ణిమ, సరస్వతి, ఎల్లమ్మ ,శిరీషా పాల్గొన్నారు.

'బీసీలపై దౌర్జన్యం చేశారు'




ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: యాదమరి మండలం తాళమడుగు కెసిబి కాలనీ భూవివాదంలో హైకోర్టు లాయర్‌నంటూ దామోదర్ నాయుడు బిసిలైన తమపై దౌర్జన్యం చేశారని ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తాళ్ళమడుగుకు చెందిన బాలరాజు, శంకర్, కేశవులు, చిన్నబ్బలు తెలిపారు. భూవివాదం కోర్టులో ఉంటే మూడు వాహనాల్లో రౌడీలను తీసుకొచ్చి తమపై దౌర్జన్యం చేసేందుకు ప్రయత్నిస్తే తాము ప్రతిఘటించిన్నట్లు చెప్పారు. హైకోర్టులో లాయర్‌ను అంటూ బీసి మహిళలపై దౌర్జన్యం చేయడంతో పాటు నానా బూతులు తిట్టారన్నారు. చట్టపరంగా తమకు రావాల్సిన భూమిని కాజేయాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

పర్యావరణ పండుగ చేద్దాం




ప్రజాశక్తి-పలమనేరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలమనేరు ప్రకృతి కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర పలమనేరు పరిరక్షణ సమితి సహకారంతో పర్యావరణ దినోత్సవానికి కావాల్సిన సన్నాహక కార్యక్రమంపై ఆదివారం చర్చించారు. పర్యావరణ దినోత్సవం రోజు పట్టణంలో మొక్కలతో ర్యాలీ నిర్వహించి ప్రజలలో మొక్కల ఆవశ్యకతను వివరించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పలమనేరులో పర్యావరణానికి సహకరించిన సేవారత్న శ్రీపురం సీతారామయ్య, లక్ష్మీ జువెలరీస్ ప్రకాష్, ప్రధానోపాధ్యాయులు గణపతి, నాగరాజు, వీరభద్ర గౌడ్‌లను పలమనేరు ప్రకృతి కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర, పలమనేరు పరిరక్షణ సమితి అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, సభ్యులు సన్మానించారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఈశ్వరుని గుడి వద్ద నుంచి మొక్కల ర్యాలీ ప్రారంభమగునని, అందరూ ఈ కార్యక్రమానికి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గుణశేఖర్, గిరిధర్ మూర్తి, తులసినాదం నాయుడు, సదానంద రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, సురేంద్రనాథ్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి నుంచి వైసిపిలో చేరిక



ప్రజాశక్తి-పలమనేరు: రూరల్ మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ అయ్యంరెడ్డిగారి పల్లి గ్రామానికి చెందిన సుమారు 20 మంది తేదేపా క్రియాశీలక కుటుంబాలు రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన మెచ్చి ఎమ్మెల్యే వెంకటే గౌడ ఆధ్వర్యంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పలమనేరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సుబ్రహ్మణ్యం, గురుస్వామి, నటరాజు, చంద్రప్ప, రఘుపతి, రాజేంద్ర, ప్రవీణ్ కుమార్, వెంకట్రామయ్య, సుబ్బయ్య, వెంకటేష్, మనోహర, చంద్రప్ప, శివకుమార్ ఉన్నారు. కార్యక్రమంలో కోలమాసనపల్లి సర్పంచ్ గోవింద స్వామి, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చెంగారెడ్డి, వైస్ ఎంపీపీ గజేంద్ర పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో పొన్న యుగంధర్




ప్రజాశక్తి-వెదురుకుప్పం: స్థానిక ద్రౌపది ధర్మరాజు సమేత దేవాలయంలో వెలిసిన అమ్మవారిని జనసేన గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పొన్న యుగంధర్ దర్శించుకున్నారు. ఆదివారం ఆలయ నిర్వాహకులు బండి ఉమాపతిరెడ్డి ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల అధ్యక్షులు పురుషోత్తం, జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్, రాఘవ, ప్రధాన కార్యదర్శి ముని, మధు, మహేష్, నాయకులు శేఖర్, నగరం మండల ప్రధాన కార్యదర్శి సోము, కార్యదర్శి నవీన్ తదితరులు ఉన్నారు.

జిడి నెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్‌గా థామస్



ప్రజాశక్తి-వెదురుకుప్పం/ఎస్ఆర్ పురం: గంగాధర నెల్లూరు నియోజకవర్గం, తెలుగు దేశం పార్టీ ఇన్‌ఛార్జ్‌గా థామస్‌ని నియమించడాన్ని వెదురుకుప్పం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు స్వాగతించారు. ఆదివారం పార్టీ కోఆర్డినేటర్ భీమనేని చిట్టిబాబు నాయకత్వంలో థామస్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ఎమ్మెల్యేగా అఖండ మెజారిటీతో గెలిపించాలని, మండలంలోని చెన్నుగారిపల్లి కారకమాని గంగమ్మ దేవాలయంలో అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దేవాలయం ఎదుట 101 కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షులు క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పి.మోహన్ మురళి, నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ గురుశాల కిషన్ చందు, నియోజకవర్గ టిఎన్టియుసి అధ్యక్షులు గాలి బాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని బందార్లపల్లి పంచాయతీ, తగరాల తండా గ్రామంలో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని స్థానిక సర్పంచ్ రాజగోపాల్ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశంలో జడ్పిటిసి దష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఈ విషయాన్ని జడ్పిటిసి నితిన్ రెడ్డి, ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్ దష్టికి తీసుకెళ్లగా జడ్పీ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయించారు. ఆదివారం తగరాల తండ గ్రామంలో బోర్ డ్రిల్లింగ్ కార్యక్రమాన్ని ఎంపి రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్, జడ్పిటిసి నితిన్ రెడ్డి ప్రారంభించారు. సమస్యను తెలియజేసిన వెంటనే స్పందించి జడ్పీ నిధులను మంజూరు చేయించిన జడ్పిటిసికి స్థానిక ప్రజలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి సుబ్రమణ్యం, వైసీపీ మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ రాజగోపాల్, కేశవరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, లక్ష్మణ్ రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

రైల్వేలో లక్ష ఉద్యోగాలు ఖాళీ

మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: రైల్వే శాఖలో సుమారు లక్ష ఉద్యోగాలు ఖాళీలు ఉంటే వాటిని భర్తీ చేయకుండా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తుందని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని ముక్కళత్తూరు పంచాయతీ ఎం నాసంపల్లి దళిత వాడలో పలువురు కాంగ్రెస్ నేతలతో కలిసి మాజీ కేంద్రమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రస్తుతం అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ అమలు చేసిన పథకాలపై పలువురు దళితుల వద్ద అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి ప్రస్తుత సీఎం జగన్ రెడ్డి, మాజీ సీఎం చంద్రబాబు నాయుడులు జిల్లాకు చేసిందేమీ లేదని, అంతేకాకుండా గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులను అమలు చేయకుండా పక్కన పెట్టారని ధ్వజమెత్తారు. ఒరిస్సా వద్ద జరిగిన రైలు ప్రమాదంలో పూట గడవని కటిక పేదవారు మాత్రమే అధిక సంఖ్యలో మరణించినా బిజెపి ప్రభుత్వం మభ్యపెడుతుందని విమర్శించారు. సమావేశంలో పిసిసి మెంబర్లు పోటుగారి భాస్కర్, పరదేశి, విక్టోరియా, వెదురుకుప్పం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉమేష్, రాష్ట్ర ఓబీసీ కాంగ్రెస్ పార్టీ మెంబర్ సుబ్బరాయులు, నేతలు ప్రభాకర్, జ్యోతినాథ్, కుప్పం పళని, మురుగన్, రంగస్వామి పాల్గొన్నారు.

రైతులకు మంచి పంటలు పండాలి



ప్రజాశక్తి-పుంగనూరు: ప్రకతి సహకరించి రైతులు మంచి పంటలు పండించుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ప్రముఖ వ్యాపారవేత్త రామచంద్ర యాదవ్ చెప్పారు. ఆదివారం చౌడేపల్లి మండలం లద్దిగం గ్రామం వద్ద ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులందరికీ ఆయన ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి రైతులకు ముఖ్యమైన పండుగ అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని రైతులు కోస్తా ప్రాంతంలో ఎక్కువగా జరుపుకుంటారని తెలిపారు. రాయలసీమలో ఈ కార్యక్రమంపై అవగాహన తక్కువ అని చెప్పారు. రైతు బాగుండాలి, అభివృద్ధి చెందాలంటే భగవంతుడి అనుగ్రహం ఉండాలన్నారు. రైతు దుక్కి దున్ని పంట పండిస్తేనే మానవ జీవితం సాగుతుంది అన్నారు. రైతు బాగుండాలని ప్రతిఒక్కరూ కోరుకోవాలి తెలిపారు. రైతులకు ప్రభుత్వం తక్కువ ధరలో విత్తనాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ ప్రాంత రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ఖరీఫ్ సీజన్‌కు మండలంలోని బైరెడ్డిపల్లి పంచాయతీ రైతులకు స్థానిక వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేరుశనగ విత్తనాలను స్థానిక ఆర్‌బికేలో వ్యవసాయ అధికారి మునికష్ణ అధ్యక్షతన ఆదివారం రాజంపేట నియోజకవర్గం ఎలక్షన్ అబ్జర్వర్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి మొగసాల కష్ణమూర్తి, కుప్పం నియోజకవర్గం ఎలక్షన్ అబ్జర్వర్, బైరెడ్డిపల్లి మండల ఎంపీపీ మొగసాల రెడ్డప్ప, ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డ్ మెంబర్లు, సోషల్ మీడియా సభ్యులు, వైసీపీ కార్యకర్తలు రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీపీ రెడ్డప్ప రైతులు తీసుకున్న వేరుశనగ విత్తనాలను రైతులతో కలిసి పరిశీలించి కాయలు నాణ్యతగా ఉన్నట్లు తెలిపారు.

రామకుప్పం: మండలంలోని విజిలాపురం, రామకుప్పం, బందర్లపల్లి రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతులకు 40 శాతం రాయితీతో వేరుశనగ విత్తనాలు ఎమ్మెల్సీ భరత్ చేతుల మీదుగా ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, రైతు భరోసా కేంద్రాలను దేశంలోనే మొదటిసారిగా ఏర్పాటు చేసింది మన రాష్ట్రంలోనే అని తెలిపారు. ఈ రైతు భరోసా కేంద్రాలలో విత్తనం నుంచి, విక్రయం వరకు రైతుకు కావలసిన అవసరాలను తీర్చడమే ధ్యేయంగా మన సీఎం జగన్ ఏర్పాటు చేశారని తెలియజేశారు. అదేవిధంగా విజిలాపురం సర్పంచ్ బాబు రెడ్డి మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైతుకు రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ విత్తనాలు సకాలంలో అందించడంతో రైతు సకాలంలో పంట పండించుకుని అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పిటిసి నితిన్, సర్పంచ్‌లు మురళి, రాజ గోపాల్, ఎంపీటీసీ వెంకట్రామయ్య గౌడ్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఆనంద్, మధురవాణి, రైతులు పాల్గొన్నారు.




స్కాలర్‌షిప్ పరీక్షలో విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-యాదమరి: డీకే చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు తొలిసారిగా నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్-2023కు ఎన్నిక కావడం విశేషం. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పార్థసారథి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం పర్యవేక్షణలో 8వ తరగతి విద్యార్థినులు బి.భూమిక, ఎన్ హిమబిందు స్కాలర్ షిప్‌కు ఎన్నికయ్యారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వీరిద్దరికీ సంవత్సరానికి రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాలకు రూ.48 వేలు, ఇంటర్ విద్యకు నెలకు రూ.1000/- చొప్పున స్కాలర్‌షిప్ లభిస్తుంది. డీకే చెరువు పాఠశాల విద్యార్థినులు పరీక్షల్లో విజయం సాధించినందుకు వారిని, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి రుక్మిణి అభినందించారు.





గరుడవాహనంపై నారాయణుని చిద్విలాసం



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: వేపంజేరి గ్రామంలోని శ్రీ లక్ష్మీ నారాయణుడు గరుడ వాహనంపై అధిరోహించి చేసిన చిద్విలాసం పలువురు భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం గరుడపౌర్ణమి సందర్భంగా ఆలయంలో మూలవిరాట్టు లక్ష్మీనారాయణులకు అభిషేకం పూజలు నిర్వహించారు. ఆలయంలో సాయంత్రం గరుడ వాహనంపై నారాయణుని విగ్రహాన్ని అధిష్ఠించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. గరుడ సేవ పూజలకు శేషాద్రి రంగస్వామి ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ వేడుకలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పలువురు భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశులు రెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


గంగ జాతరలో నాయకులు



ప్రజాశక్తి-గంగవరం: మండల కేంద్రం గంగవరంలో శనివారం రాత్రి గ్రామ దేవత అయిన గంగమ్మను ఊరేగించి రకరకాల వేషధారణతో అతి వైభవంగా నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. ఆదివారం గంగ జాతర సందర్భంగా స్థానిక శాసనసభ్యులు వెంకటే గౌడ, మండల నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఆయన తెలియజేశారు. అనంతరం మాజీ మంత్రి వర్యులు అమర్‌నాథరెడ్డి కుటుంబంతో పాటు స్థానిక తెలుగు దేశం పార్టీ నాయకులు సమేతం గంగ జాతరలో పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలియజేశారు.

జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిని కలిసిన హేమంత్

ప్రజాశక్తి-పలమనేరు: జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఉషశ్రీ చరణ్‌ను, పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి ఆదివారం మంత్రి స్వగృహం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎంఆర్ వేణుగోపాల్ రెడ్డి, పెద్దపంజాణి ఎంపీటీసీ సభ్యులు గురుమూర్తి తదితరులు ఉన్నారు.



గాన గంధర్వునికి ఘన నివాళి



ప్రజాశక్తి-పలమనేరు: గాన గంధర్వుడు ఎస్‌పి బాలసుబ్రమణ్యం జయంతి సందర్భంగా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో కళామందిరంలో కళాకారులు, సాహితీవేత్తలు ఆదివారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు పి.తులసినాధం నాయుడు మాట్లాడుతూ తెలుగు మాట, పాటను ప్రపంచవ్యాప్తం చేసిన ఘనుడు బాలసుబ్రమణ్యం అన్నారు. అనంతరం గాయకులు పాటలు పాడి అలరించారు. పాటలు పాడటంలో ప్రతిభ చూపిన వై.క్రిష్ణ, సురేంద్రనాయుడు, సిద్దారెడ్డి, దేవరాజు, చెంగల్రాయప్ప, దవనముని, గిరిధరమూర్తి, శివశంకర్ రెడ్డిలను సంస్థ నిర్వాహకులు పి.తులసినాధం నాయుడు, పుష్ప, శ్రీపురం శీతారామయ్య, మురళీమోహన్‌లు ఘనంగా సత్కరించారు.

ఘనంగా దుర్యోధన వధ



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని జక్కదొన గ్రామంలో వెలిసియున్న శ్రీ కష్ణ ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో గత పది రోజులుగా జరుగుతున్న వార్షిక మహాభారత మహోత్సవంలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం దుర్యోధన వధ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మహాభారత ఆవరణంలో దుర్యోధనుడి ప్రతిమను ఏర్పాటు చేసి అక్కడ దుర్యోధనుడు, భీముడు యుద్ధ ఘట్టాన్ని శ్రీ వెంకటేశ్వర నాట్య కళామండలి సభ్యులు అద్భుతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

డిపో అభివృద్ధికి సమిష్టి కృషి



ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు ఏపీఎస్‌ఆర్టీసీ అభివృద్ధికి సమిష్టి కృషి అవసరమని ఏపీఎస్‌ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి చెప్పారు. పుంగనూరు డిపోను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరు ఆర్టీసీ డిపో ఏర్పడటానికి, డిపోను అభివృద్ధి పరచడానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎంతో కృషి చేశారని చెప్పారు. కావున ఉద్యోగస్తులందరూ డిపో అభివృద్ధి కృషి చేయాలని పేర్కొన్నారు. డిపోలోని ఉన్నతాధికారుల నుంచి కండక్టర్లు, డ్రైవర్లు అందరూ కలిసికట్టుగా కృషి చేస్తేనే డిపో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షులు జి.జయరామ్ రెడ్డి, పుంగనూరు డిపో అభివృద్ధి మండలి ఛైర్మన్, డిపో మేనేజర్ కె.సుధాకరయ్య, వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ ఎస్.కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రయమిచ్చి ఆదుకోండి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఆశ్రయమిచ్చి ఆదుకోవాలని చిన్న పాపమ్మ ఆదివారం అన్నారు. మండలంలోని బొమ్మయపల్లి గ్రామంలో చిన్న పాపమ్మకు నివసిస్తోంది. ఆమెకు ఇద్దరు కుమారులు. ఆమెను ఇద్దరు కుమారులు పట్టించుకోలేదని, ఆమెకు వచ్చే వితంతు పింఛన్‌తో జీవనం సాగిస్తోంది. వంట చేసుకోవడానికి ఆరోగ్యం సహకరించక ఆకలితో అలమటిస్తూ కనపడినవారిని సహాయం చేయమని అర్థిస్తోంది. ఎవరైనా సహాయం చేసేవారు ఆదుకోవాలని మొరపెట్టుకుంది.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి- గూడూరు టౌన్: రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో గూడూరు రైల్వేస్టేషన్‌లో ఆదివారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. దాత హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 300 మంది ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్, రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు, రైల్వే హాస్పిటల్ డాక్టర్ సుందర్ కుమార్, ఆర్.పి.ఎఫ్ సి.ఐ లక్ష్మీ నారాయణ, రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ అరేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువుల పెంపకంలో మెళకువలపై శిక్షణ



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలోని నిరంతర పశువిద్య సమాచార కేంద్రం ఆధ్వర్యంలో సేవ్ ది చైల్డ్ ఆర్గనైజేషన్ వారి సహకారంతో 'పాడి పశువుల పెంపకంలో మెళకువలు విలువ ఆధారిత పాల పదార్థాల తయారీ అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ కార్యక్రమం సమన్వయకర్త డాక్టర్ సుజాత, శాస్త్రవేత్తలు డాక్టర్ జి. గంగరాజు, డాక్టర్ బి. విజయ గీత మాట్లాడుతూ పాడి పశువులకు సాధారణంగా వచ్చే వివిధ రకాల వ్యాధులు, బ్యాక్టీరియా, వైరస్‌లకు సంబంధించి వ్యాధులను సకాలంలో గుర్తించాలన్నారు. గాలికుంటు వ్యాధి, గొంతు నొప్పి వ్యాధి, ఆంత్రాక్స్ మొదలైన వ్యాధుల వ్యాప్తి నివారణ చికిత్స విధానాల గురించి వివరించారు. పాడి రైతులు పశువుల పెంపకంలో పాటించాల్సిన జాగ్రత్తలు, పాడి పశువుల పోషనకు వివిధ రకాల పశుగ్రాసాలని ఏవిధంగా సాగుచేసుకోవచ్చు వివరించారు. శిక్షణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ట్రై సైకిల్ వితరణ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కలిశెట్టి చెంచుకష్ణయ్య మెమోరియల్ ట్రస్ట్ కొణిదల మునిగిరీష్ గూడూరు రెండో పట్టణ పరిధిలోని కోర్ట్ సెంటర్‌లో నివాసం ఉంటున్న మంగలపూరు నాగలక్ష్మి అనే దివ్యాంగురాలికి మూడు చక్రాల సైకిల్‌ను అందించారు. ఆయన మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక సైన్స్ సంస్థ అయినప్పటికీ అనేక సేవాకార్యక్రమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేవీవీ అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, పురుషోత్తమరావు, రాధయ్య, కటకం శ్రీను, నక్కా గోపి, యస్.కె.సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరపాలి

- టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు ప్రభుతేజా

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: రైలు ప్రమాదంలో మరణించిన వారికి రూ.50 లక్షలు, క్షతగాత్రులకు రూ.25లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఆదివారం ఒక ప్రకటనలో తెలుగు నాడు విద్యార్థి సమైక్య చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షులు ప్రభుతేజ కోరారు. ఈ దుర్ఘటనలో 260మందికి పైగా మరణించడంతో పాటు 800 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. ఆ ప్రాంతమంతా బాధితుల హార్తనాదాలతో హదయ విదారకంగా మారిందని ఈ సంఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర రైల్వేశాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం రైల్వే రంగంలో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయకపోవడం, రైల్వేల ప్రైవేటీకరణకు పూనుకోవడం, ఆదానికి రైల్వేలను అప్పగించడం జరిగిందని అన్నారు. ఇప్పటికే 100కు పైగా రైల్వే స్టేషన్లను, రైల్వే లైన్లను ప్రైవేటీకరణ, వందే భారత్ వంటి ట్రైన్‌లను తీసుకొచ్చామని ఊదరగొట్టడం తప్ప చేసిందేమి లేదన్నారు.

ఆలయ నిర్మాణానికి వితరణ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని దేవదొడ్డిలో నూతనంగా నిర్మిస్తున్న సీతారాముల ఆలయ నిర్మాణానికి గుంటూరుకు చెందిన వెంకటరమణ రూ.1.50 లక్షలు విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అమీర్ బాషా, సుబ్రహ్మణ్యంలకు ఆదివారం అందించారు. వెంకటరమణ జన్మస్థలం దేవదొడ్డి, వ్యాపారరీత్యా గుంటూరులో స్థిరపడ్డారు. జన్మభూమిపై మమకారంతో ఈ విరాళం అందజేసినట్లు దాత తెలిపారు. అనంతరం దాతను ఆలయ కమిటీ కృతజ్ఞతలు తెలిపారు.

అందుబాటులో ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశాలకు ఈనెల 11వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు, ఈ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లు విడుదల చేసినట్లు ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ ఎం.వి.కష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపినట్లు కమ్మనపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అనిత చెప్పారు. హాల్ టికెట్లను https://apms.apcfss.in/StudentLogin.do వెబ్ సైట్లో అందుబాటులో ఉంచినట్లు వారు తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



ప్రజాశక్తి-పెళ్లకూరు: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని.. అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారుంటే స్థానిక సచివాలయాల్లో సంప్రదించాలని ఎమ్మెల్యే కలివేటి సంజీవయ్య అన్నారు. ఆదివారం పెళ్లకూరు మండలంలోని బంగారంపేట గ్రామ సచివాలయ పరిధిలోని మోదుగులపాలెం, ఊటీపూడి గ్రామాలలో ఆదివారం ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ ప్రిస్కిల్లా ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ఇప్పటివరకు ప్రతి కుటుంబం పొందిన ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సోమశేఖర్ రెడ్డి, సుధాకర్, మోహన్, శ్రీనివాసులురాజు, నరేష్, భాస్కర్, అమర్నాథరెడ్డి, వీరకుమార్, ఎంపీటీసీలు, సర్పంచులు, అన్నిశాఖల అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుపతిలో వైశ్య యూత్ పరిషద్ రాష్ట్ర శాఖ ప్రారంభం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాల్లో వైశ్యులలో చైతన్యం తీసుకురావాలనే లక్ష్యంతో ఏర్పాటైన సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషద్ కార్యాలయాలను ఒకే సమయంలో ఐదు రాష్ట్రాల్లో ప్రారంభించారు. ఆంధ్ర రాష్ట్ర కార్యాలయాన్ని తిరుపతి శాంతినగర్‌లో ప్రారంభించామని ఆంధ్ర ప్రదేశ్ శాఖ అధ్యక్షులుగా రాచపల్లి బాలాజీ తెలిపారు. టిటిడి పాలక మండలి సభ్యులు మురంశెట్టి రాములు ఫౌండర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారన్నారు. అలాగే కార్యదర్శిగా పెడబల్లె వికాస్, కోశాధికారిగా పుట్టా శివ ప్రసాద్ నియమితులయ్యారన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బాలాజీ మాట్లాడుతూ సంస్థను ముందుకు తీసుకెళ్లడంలో భాగంగా సప్తసూక్త పథకాన్నిఅవలంభింపచేస్తామన్నారు. వైశ్యులలో రాజకీయ చైతన్యం తీసుకురావడం, సనాతన ధర్మాలను కాపాడటం, గోసేవ మొదలైన ముఖ్య లక్ష్యాలతో ముందుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో కర్ణాటక శాఖ కార్యదర్శి సుబ్బలక్ష్మి, ప్రసన్న , కార్తీక్, ఈశ్వర్,రాజు, మనోహర్, రాజేష్, తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

ఘనంగా మహర్షి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పట్టణంలోని కచేరి వీధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం మహిళా విభాగం కోశాధికారి, చెంగాలమ్మ ఆలయ పాలకమండలి సభ్యురాలు మన్నెముద్దు పద్మజ నివాసం వద్ద ఆదివారం దేవల మహర్షి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవతలకు వస్త్రాలు తయారు చేయడానికి పరమశివుని పాలనేత్రం నుంచి జ్యేష్ఠ పౌర్ణమి నాడు ఉద్భవించిన దేవల మహర్షి వస్త్రాలు తయారుచేసి పరమశివుడికి అందజేశారు. యజ్ఞోపవేతం ధరించి సహజ సిద్ధ దేవ బ్రాహ్మణులుగా ఉద్భవించి దేవల మహర్షి దేవతలకు వస్త్రాలు సమర్పించడంతో దేవాంగ కుల మూల పురుషుడుగా ఆయన వంశీకులు ఇప్పటికీ అనేక గోత్రనామాలతో విశ్వవ్యాప్తంగా విరాజల్లుతున్నారు. జ్యేష్ఠ పౌర్ణమి రోజున ప్రత్యేకతను పురస్కరించుకొని వస్త్ర నిర్మాత అయిన దేవల మహర్షి ఆశీస్సుల కోసం ఆదివారం దేశవ్యాప్తంగా అనేక చోట్ల వస్త్ర దానం చేయడం దేవాంగులకు ఆనవాయితీ. ఈ వేడుకలలో రాష్ట్ర దేవాంగ సంఘం ఉపాధ్యక్షులు మన్నెముద్దు శ్రీనివాసులుతో పాటు దేవాంగ సమాజ ప్రతినిధులు నిర్మల, పథ్వి వెంకటేశ్వర్లు, గుత్తి త్యాగరాజు, నాప కుమారస్వామి, శివ శంకర్ నాప ముని రాజా, సీత చెంచు కష్ణ, పిచ్చిక సూరిబాబు, కొలమల నంద, చింతం సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-కోట: మండలంలోని విద్యానగర్‌లో ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో బీకామ్ 1998-2001 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం గూడూరు బైబాస్ ఏ5 కన్వెన్షన్ హాల్ లో కలిశారు. ఇంతకన్నా ఆనందం మరొకటి లేదని అందరూ పూర్వ జ్ఞాపకాలను స్మరించుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. 22 సంవత్సరాల తర్వాత ఒక్కసారిగా కలవడంతో ఒకరినొకరు ప్రేమ, అభిమానం, అనురాగం, ఆప్యాయతలను పంచుకున్నారు.